క్లుప్తంగా

నేటి నుంచి శివాలయంలో ప్రత్యేక పూజలు


బౌడ గ్రామంలో శివాలయం

చింతపల్లి: మండలంలో బౌడ గ్రామంలో శివాలయంలో సోమవారం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. మహాశివరాత్రి పర్వదినాలను పురస్కరించుకొని మూడు రోజుల పాటు ఆలయంలో రోజు తెల్లవారుజాము నుంచి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, కుంకుమ పూజలు, హోమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అదే విధంగా రోజు భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అరకులోయటౌన్: అరకులోయ పట్టణంతో పాటు అరకు(అంజోడ) ఫీడర్ల పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ ఈఈ అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంతో పాటు అరకు (అంజోడ) 11కేవి పరిధిలోని అరకులోయ, యండపల్లివలస, పానిరంగిని, రవ్వలగుడ, శరభగుడ గ్రామాల్లో విద్యుత్ స్తంభాల మార్పు పనుల నిమిత్తం ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ప్రకటనలో కోరారు.

గ్రామాల్లో ఆధార్ డ్రైవ్

అనంతగిరి(అరకులోయటౌన్): అనంతగిరి, టోకూరు గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంప్ నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు ఈ క్యాంప్ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లో బయోమెట్రిక్ అప్‌డేట్, కార్డులోని వివరాల్లో మార్పుచేర్పులు, చిన్నపిల్లలకు కార్డుల నమోదు తదితర సేవలందిన్నట్టు తెలిపారు. ఆయా ప్రాంతవాసులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కుమార్ కోరారు.

సమస్యలపై అవగాహన ఉన్న అభ్యర్థులనే గెలిపించండి

రాజవొమ్మంగి: ప్రజలు, కార్మికులు. ఉపాధ్యాయులు, ఉద్యోగ, నిరుద్యోగుల సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న ఎమ్మెల్సీ అభ్యర్థులనే గెలిపించాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు కోరారు. చట్టసభల్లో సమస్యలపై గళం విప్పే అభ్యర్థులకే మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు. పీడీఎఫ్ ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి రాఘవులకు మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించారు.

పారాలీగల్ వలంటీర్లకు దరఖాస్తులు

చింతపల్లి: గిరిజన ప్రాంతంలో పారాలీగల్ వలంటీర్లుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు ఎం.రోహిత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు అవసరమైన న్యాయ సలహాలను అందించేందుకు ఆసక్తిగల యువకులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థుల కనీస విద్యార్హత పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, సేవా సంస్థల్లో పనిచేసిన వారికి తొలి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 25 తేదీ లోగా చింతపల్లి న్యాయ స్థానంలో ఉన్న న్యాయ సేవాధికార సంస్థలో దరఖాస్తులను అందజేయాలన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్హత ధ్రువపత్రం, ఆధార్ కార్డు, ఒక పాస్‌పోర్టు సైజు ఫోటో జతచేయాలని సూచించారు. ఎంపికై న వారికి ఎటువంటి జీతం గౌరవ వేతనం చెల్లించడం జరగదన్నారు.

నేడు వెంకన్న కల్యాణానికి పెళ్లిరాట


ఉపమాక వెంకన్న ఆలయం

నక్కపల్లి: వచ్చే నెల 10వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఉపమాక వేంకటేశ్వర స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలకు సంబంధించి పెళ్లి రాట(పందిరి రాట) వేసే కార్యక్రమం సోమవారం జరగనుంది. పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారం సోమవారం 7.50 గంటలకు పెండ్లి రాట వేయడానికి నిర్ణయించినట్లు ఆలయ ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాషేకం, నిత్య కార్యక్రమాలు పూర్తి చేసిన అనంతరం ఆస్థాన మండపం ఎదురుగా ఉన్న ధ్వజస్తంభం వద్ద పెళ్లి రాట వేస్తామన్నారు. వచ్చేనెల 10 నుంచి ఐదు రోజుల పాటు స్వామివారి కల్యాణోత్సవాలు నిర్వహిస్తామన్నారు. సుమా రు 20 రోజుల పాటు ఉపమాకలో తిరునాళ్లు జరుగుతాయని ఆయన చెప్పారు. స్వామివారి కల్యాణోత్సవాలకు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

కూరగాయల సాగు.. లాభాలు బాగు

- విస్తృతంగా కూరగాయలు, వాణిజ్య పంటలు
- మైదాన ప్రాంతాలకు తరలింపు
- గిట్టుబాటు ధరలు.. ఆనందంలో రైతులు


సొవ్వ గ్రామంలో సాగులో ఉన్న కూరగాయల పంటలు


ముసిరిలో క్యాబేజీ పంట సాగు

డుంబ్రిగుడ: అల్లూరి జిల్లాలో కూరగాయలు, ఆకు కూరల సాగులో డుంబ్రిగుడ మండలం ముందు వరసలో ఉంది. మండలంలోని సొవ్వ పంచాయతీ గిరిజన రైతులు పాతికేళ్లుగా కూరగాయల పంటల పండించడంలో ఆరితేరిపోయారు. విశాఖపట్నం పూర్ణామార్కెట్‌తో పాటు పట్నంలోని అన్ని రైతు బజార్లకు సొవ్వలో పండించిన కూరగాయలను తరలిస్తుంటారు. ఏటా మూడు సీజన్‌లలో ఇక్కడి రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులను ఒడిసి పట్టుకొన్ని అన్ని రకాల కూరగాయలను పండిస్తూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. సొవ్వలో పండించిన కూరగాయలను తరలించేందుకు నేరుగా వ్యాపారస్తులు గిరిజన రైతుల ఇంటి వద్ద వచ్చి కొనుగోలు చేస్తుంటారు. కొంత మందికి పాడేరు ఐటీడీఏ అందజేసిన రైతు బజారు కార్డుల ద్వారా వారి వారి సొంత వాహనాల్లో కూరగాయలను మైదాన ప్రాంతాలకు తరలిస్తుంటారు.

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

ప్రస్తుతం సొవ్వ గ్రామంలో అల్లం, మిరపకాయ, బంగాళదుంపలు, క్యారెట్, క్యాబేజీలతో పాటు బ్రకోలీ పంటలతో పాటు వాణిజ్య పంటలు పిప్పళ్లు, వలిసెలు, పొద్దుతిరుగుడు వంటి పంటలను పండిస్తున్నారు. మండలంలోని సొవ్వతో పాటు రంగిలిసింగి, కంద్రుమ్, పోతంగి, కితలంగి, కురిడి, సాగర, గసభ, కొల్లాపుటు పంచాయతీల్లో కూరగాయల సాగు గణనీయంగా ఉంది. ఇక్కడ పండించే కూరగాయలకు మంచి మార్కెట్ ఉండడంతో ఏటా సాగు విస్తీర్ణం పెంచుతున్నారు. సంతల్లో, మైదాన ప్రాంత మార్కెట్‌లలో ఆశించిన ధరలు వస్తుండడంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వారపు సంతల్లో దళారుల బెడద

ప్రతి బుధ, శుక్రవారాల్లో మండలంలోని వారపు సంతలు జరుగుతాయి. అయితే మైదాన ప్రాంతంతో ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న వ్యాపారులు సంత ముందురోజు, అంటే మంగళ, గురువారాల్లో ఇక్కడికి వస్తుంటారు. రైతుల నుంచి నేరుగా కూరగాయలు, ఆకుకూరలు కొనుగోలు చేసుకొని తరలిస్తుంటారు.


గ్రామంలో వంగ పంట


సంతలో విక్రయిస్తున్న బ్రోకోలి, ఆకుకూరలు


సొవ్వలో టమాటా సాగు

అరకులో శుక్రవారం జరిగే సంతలో రూ.2.50కోట్ల వ్యాపారం జరుగుతున్నట్టు తెలిసింది. సంతల్లో కూరగాయలు, ఆకుకూరలతో పాటు అటవీ ఉత్పత్తులు కొండచీపుళ్లు, అడ్డాకులు తదితర వస్తువుల వ్యాపారం జరుగుతుంది. వేర్వేరు ప్రాంతాల నుంచి అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను తీసుకొచ్చి గిరిజనులు విక్రయిస్తారు. మండలంలోని ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో అల్లం పంట ఎక్కువగా సాగులో ఉంది. ప్రస్తుతం అల్లం కిలో రూ.80 నుంచి రూ.90 వరకు ధరలు పలుకుతుంది. వారపు సంతల్లో దళారుల బెడద ఎక్కువైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులంతా సిండికేట్‌గా మారి ధరలు నిర్ణయిస్తుండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను తక్కువ ధరలకు విక్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి గిరిజన రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ప్రభుత్వం రాయితీలు అందించాలి



ప్రస్తుతం నేను విత్తనాల కోసం రూ.30000 లు ఖర్చు పెట్టి వేశాను. రూ.1.20 లక్షతో బోరింగు ఏర్పాటు చేసుకున్నాను. కష్టానికి తగిన ఫలితం ఉంది. ప్రస్తుతం కూరగాయలకు మార్కెట్‌లో మంచి ధరలున్నాయి. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు అందజేస్తే మరింత ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగిబడి చేసే అవకాశం ఉంటుంది.

– వంతల వెంకటరావు, ముసిరిగొందిగుడ గ్రామం, అరమ పంచాయతీ

అధికారులు స్పందించాలి



ఒక ఎకరంలో కూరగాయల పంట, టమాటా, మిరప, వంకాయ, కొత్తిమీర సాగుతో పాటు ముల్లంగి, కాకరకాయ, మొక్కజొన్నను వేసాం. వేసవి సమీపిస్తుండడంతో నీరుకు బెంగ లేకుండా బోరింగు ఏర్పాటు చేసుకున్నాం. మార్కెటింగ్ సదుపాయం లేక కొందరు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం, ఐటీడీఏ ఉన్నతాధికారులు స్పందించి మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తే బాగుంటుంది.

– జ్యోతి వంతల, ముసిరి, అరమ పంచాయితీ డుంబ్రిగుడ మండలం.

సీపీఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న అసోసియేషన్ సభ్యులు

చింతూరు: చింతూరు క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చింతూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఆదివారం ప్రారంభమైంది. చింతూరు, వీఆర్ పురం, కూనవరం, ఎటపాక మండలాలకు చెందిన ఆరు టీంలు పాల్గొనే ఈ టోర్నమెంటు వచ్చే నెల మూడో తేదీ వరకు జరుగుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు అందించనున్నట్టు వారు తెలిపారు. సీనియర్ క్రీడాకారులు విల్సన్, లక్ష్మీపతి, ఉదయ్, హసన్, రాజకీయ నాయకుడు ఎం.రాజు, కమిటీ సభ్యులు బుచ్చిరాజు, గణేష్, ప్రదీప్, శంకర్, రియాజ్, ప్రవీణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్తంభించిన బీఎస్ఎన్ఎల్ సేవలు

- 48 గంటలు మొరాయించిన సెల్ సిగ్నల్స్
- వినియోగదారులు అవస్థలు

రాజవొమ్మంగి: మండలంలో దాదాపు 48 గంటలుగా బీఎస్ఎన్ఎల్ (సెల్‌వన్) సేవలు పూర్తిగా నిలిచిపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నెట్‌వర్క్‌పై ఆధారపడి ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో పనులు స్తంభించాయి. ఈ ప్రాంతంలోని రెండో నెట్‌వర్క్ జియో కూడా అంతంత మాత్రంగా పనిచేసింది. దీంతో సమాచార వ్యవస్థ కుంటుపడింది. కాల్ కోసం ఎంత ప్రయత్నించినా అవతల వ్యక్తి వాయిస్ వినిపించకపోవడంతో వినియోగదారులు నానా ఇబ్బందులు పడ్డారు. తరచూ బీఎస్ఎన్ఎల్ సెల్ సిగ్నల్స్ స్తంభిస్తున్నాయని, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వినియోగదారులు కోరుతున్నారు.

ప్రసాద విక్రయానికి వేలంపాట

ఎటపాక: మండలంలోని వెంకటరెడ్డిపేటలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రసాద విక్రయానికి మార్చి1న బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్టు దేవదాయ ధర్మదాయశాఖ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బహిరంగ వేలంపాట మార్చి 1న శనివారం ఉదయం 11గంటలకు ఆలయం వద్ద నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో సాయిబాబు పేర్కొన్నారు. ఆలయంలో వచ్చే నెల 14న స్వామి వారి తిరుకల్యాణమహోత్సవం సందర్భంగా 13 నుంచి 16వ తేదీ వరకు ఆలయం వద్ద తాత్కాలిక దుకాణాలు ఏర్పాటుచేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కొబ్బరి కాయలు, లడ్డు, పులిహోర ప్రసాద విక్రయానికి వేలంపాట నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వేలంపాటలో పాల్గొన దలిచే వారు ధరావత్తు రూ.5వేలు చెల్లించాలని సూచించారు.

చెట్టుపై నుంచి జారిపడి గిరిజనుడి మృతి

కొయ్యూరు: మర్రివాడ పంచాయతీ గుడ్లపల్లికి చెందిన కొప్పుల పెంటయ్య(47) ఆదివారం జీలుగు కల్లు తీసేందుకు చెట్టు ఎక్కి జారిపడ్డారు. దీంతో తలకు, నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. పడిపోయిన కొద్ది సేపటికే పెంటయ్య మరణించాడు. అయి తే ప్రాణాలతో ఉన్నట్టు భావించిన బంధువులు వెంటనే రాజేంద్రపాలెం ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్య సిబ్బంది పెంటయ్య మృతిచెందినట్టు ప్రకటించారు. సమాచారం తెలుసుకున్న కొయ్యూరు సీఐ వెంకటరమణ, ఎస్ఐ కిషోర్‌వర్మ సంఘటన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సాహిత్యంతో సమాజ హితం


భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావును సన్మానిస్తున్న దృశ్యం

ఎటపాక: సమాజ హితాన్ని కోరేది సాహిత్యమని, సాహిత్యానికి భాష, ప్రాంతీయ బేధాలుండవని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. మండల కేంద్రంలోని డాక్టర్ పాల్‌రాజ్ ఇంజినీరింగ్ కాలేజీలో కళావేదిక ఆధ్వర్యంలో జాతీయ శతాధిక కవి సమ్మేళనం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటరావు మాట్లాడుతూ కవి సమ్మేళనాలు నిర్వహిస్తూ, కవులను ప్రోత్సహిస్తున్న కళావేదికను అభినందించి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. అనంతరం కవులను ఘనంగా సత్కరించారు. అనంతరం పలువురు ఎమ్మెల్యే వెంకట్రావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళావేదిక సీఈవో డాక్టర్ ప్రతాప్, కళాశాల చైర్మన్ వి.వరలక్ష్మి, సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ ప్రీతం, దుర్గాప్రసాద్, రమావతి, పార్థసారధి, సురేష్‌బాబు, భూపతి, శ్యామల, జకరయ్య, మాధవరెడ్డి, లలిత, కవులు తులసీదాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుని వర్ధంతిని మరచిన పాలకులు

రాజవొమ్మంగి: దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీషు సేనలతో పోరాడి అసువులు బాసిన మన్యం వీరుడు ద్వారబందాల చంద్రయ్యదొర వర్ధంతి (ఫిబ్రవరి 23వ తేదీ)ని పాలకులు మరిచారు. స్వాతంత్ర్య సమరయోధుడు ద్వారబందాల చంద్రయ్యదొర చరిత్రకు గుర్తుగా ఆయన విగ్రహాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మండలంలోని శరభవరం గ్రామంలో 2023లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చంద్రయ్య దొర తరం కుటుంబ సభ్యులందరికీ పిలిచి ఘనంగా సత్కరించారు. ప్రతి ఏటా ఇక్కడ చంద్రయ్య జయంతి వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించాలని గిరిజన సంక్షేమశాఖ అధికారులను ఆదేశించడం జరిగింది. కాగా ఆదివారం చంద్రయ్య వర్ధంతి రోజున ఆయన విగ్రహానికి కూటమి పాలకులు పూలమాల వేసిన దాఖలా లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ద్వారబందాల చంద్రయ్యదొరను మరచిపోవడం విచారకరమని చెప్పారు.


2023లో చంద్రయ్యదొర విగ్రహానికి పూలమాలలు వేసిన దృశ్యం (నాడు)


బోసిపోయి కనిపించిన చంద్రయ్యదొర విగ్రహం (నేడు)

సందర్శకులతో బొజ్జన్నకొండ కళకళ

తుమ్మపాల: మండలంలో శంకరం వద్ద ఉన్న బొజ్జన్నకొండ ఆదివారం జిల్లా, రాష్ట్రంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులతో కళకళలాడింది. మెట్ల మార్గం మీదుగా కొండపైకి చేరుకుని రాతి గుహల్లోని బౌద్ధ స్థూపాన్ని దర్శించుకున్నారు. గుహల్లోని ప్రాచీన కట్టడాలను, అద్భుతమైన ఆర్కిటెక్చర్ శిల్పాలను తమ కెమెరాల్లో బంధించారు. బుద్ధుని జ్ఞాన మందిరం, వివిధ ఆకృత్తుల్లో బుద్ధుని విగ్రహాలు, బొజ్జన్న కొండ చరిత్రను తెలుసుకున్నారు. లింగాల కొండపై నిర్మాణాలు, కొండపై నుంచి చుట్టు పచ్చని పంట పొలాలను చూసి మురిసిపోయారు. కొండ దిగువన ఆహ్లాదకర వాతావరణంలో సాయంత్రం వరకు ఆటపాటలతో సందడిగా గడిపారు. కొండపై గుహలు, మెట్ల వద్ద ప్లాస్టిక్ సీసాలు కుప్పలుగా పడేసి ఉన్నాయి. బుద్ధుని ప్రధాన మందిరం వద్ద పరిసరాలను శుభ్రం చేయకపోవడంపై సందర్శకులు అసహనం వ్యక్తం చేశారు.


సందడి చేస్తున్న పిల్లలు, సందర్శకులు

భక్తిశ్రద్ధలతో గౌరమ్మ నిమజ్జనోత్సవం


కశింకోట శారదానదిలో గౌరమ్మ విగ్రహ నిమజ్జనోత్సవం

కశింకోట: స్థానిక వెలంపేట గౌరీపరమేశ్వరులు(గౌరమ్మ) నిమజ్జనోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరమ్మ విగ్రహాన్ని ఆలయం నుంచి ఊరేగింపు చేపట్టారు. మహిళల కోలాటాలు, మ్యూజికల్ ఆర్కెస్ట్రాతో గవరపేట మధ్య వీధి మీదుగా పెద్దగుమ్మం వీధి వరకు ఊరేగింపు సాగింది. దారి పొడవునా గౌరమ్మను దర్శించి ప్రజలు పూజలు చేశారు. అనంతరం శారదానది ఒడ్డున సంప్రదాయంగా వేద మంత్రాల నడుమ పూజలు చేసి, నదిలో నిమజ్జనం చేశారు. ఉత్సవాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకించారు. శనివారం రాత్రి జరిగిన గౌరమ్మ ఉత్సవంలో డాన్స్ బేబీ డాన్స్, కె.కోటపాడు మండలం ఆనందపురానికి చెందిన బృందం బుర్రకథ, డూప్స్‌తో రికార్డింగ్ డాన్స్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జాతరలో జెయింట్ వీల్స్ వద్ద పిల్లలు సందడి చేశారు. భారీగా బాణసంచా కాల్చారు. సీఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.


జెయింట్ వీల్స్ వద్ద పిల్లల సందడి

మునగపాకలో గడ్డి కుప్ప దగ్ధం

మునగపాక: మునగపాక బీసీ కాలనీలో వరిగడ్డి కుప్ప దగ్ధమైంది. బీసీ కాలనీలో ఆదారి పెంటారావు పాడి పశువులను పెంచుతూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా ఆయనకు చెందిన గడ్డి కుప్పకు మంటలు వ్యాపించాయి. దీంతో స్థానికులు మంటలను అదుపుచేశారు. ఈ ఘటనలో సుమారు రూ.50వేలకు పైగా ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.

గ్రామాల్లో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ


చౌడువాడలో లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో సేవాగరిడి, ప్రార్థన చేస్తున్న భక్తులు


తోడ పెద్దు సేవ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు


వేదపండితులతో సీతారాముల విగ్రహ ప్రతిష్ట

కె.కోటపాడు: చౌడువాడలో ధనిమిశెట్టి, సియ్యాద్రి కుటుంబాల వారు మూడు రోజులుగా నిర్వహించిన లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. మహా శివరాత్రి సందర్భంగా ఈ వేడుకలను నిర్వహిస్తుంటారు. సింహాద్రిఅప్పన్న ప్రతిరూపంగా ధనిమిశెట్టి, సియ్యాద్రి కుటుంబాలు వారు భావించే తోడపెద్దును గ్రామంలో భజనా కార్యక్రమాలతో ఘనంగా ఊరేగింపు చేశారు. ఇందులో భాగంగా పాలు కొలుపు, ప్రార్థన, సేవా గరిడీ సేవతో పాటు సింహాద్రి అప్పన్నస్వామి భక్తి గీతాలను ఆలపించారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులతోపాటు సమీప గ్రామాల ప్రజలు హాజరయ్యారు. ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. చివరి రోజు సింహాద్రప్పన్న మందిరంలో జెడ్పీటీసీ ఈర్లె అనురాధ ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, చల్లా సురేష్ పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట

నాతవరం: మండలంలో మర్రిపాలెం పంచాయతీ శివారు వెన్నలపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా రామాలయంలో వేదపండితులతో ప్రత్యేక హోమాలు, పూజలు చేశారు. ఈ సందర్భంగా బంధువులు, ఆడపడుచులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో కదిలిరావడంతో రామాలయం ప్రాంగణమంతా కిక్కిరిసి పోయింది. విగ్రహ ప్రతిష్ట పూర్తయ్యాక రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం మహిళల భజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

దేవరాపల్లి: మండలంలోని వేచలంలో సీతారామ సహిత విఘ్నేశ్వర, లక్ష్మీదేవి ఆలయ విగ్రహ ప్రతిష్ట వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. మహిళల కోలాటం, భజనా కార్యక్రమాలు, జై శ్రీరామ్ నినాదాలతో వేచలంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను సత్కరించారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి దంపతులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, కె.కోటపాడు ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, కొప్పుల వెలమ కార్పొరేషన్ మాజీ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, పార్టీ ఆర్టీఐ విభాగం జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు వరదపురెడ్డి లలితనాయుడు, సర్పంచ్ నాగిరెడ్డి శరారినాయుడు, ఎం. అలమండ సర్పంచ్ దాడి జగన్, ఆర్.వి.కె.నాయుడు, వేచలపు చిన్నంనాయుడు, వేచలపు కృష్ణ, బత్తి నాయుడు, బండారు ప్రసాదరావు, కె.ఎస్. అప్పలనాయుడు తదితరులు దర్శించుకున్నారు. రాత్రికి ఏర్పాటు చేసిన రామాంజనేయ, గయోపాఖ్యానం యుద్ధ సన్నివేశాలు భక్తజనాన్ని విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఘనంగా ఒడ్డు పండగ

మాడుగుల రూరల్: ఎం. కోడూరు మోదమాంబ ఆలయం వద్ద ఆదివారం ఒడ్డు పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామానికి చెందిన పుట్టా కొండలరావు కుటుంబ సభ్యులు ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సర్పంచ్ సంజీవిరావు, గ్రామస్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. సాగరం, ఘాట్‌రోడ్డు కాటా ఆవరణలో మోదమాంబకు ఒడ్డు పండగలు చేశారు.


ప్రత్యేక అలంకరణలో మోదకొండమ్మ

అమ్మవారి ఆలయానికి విరాళం

మునగపాక: మునగపాక బైపాస్‌రోడ్డులో నిర్మిస్తున్న మోదకొండమ్మ తల్లి ఆలయానికి భక్తులు విరాళాలు అందిస్తున్నారు. మునగపాకలో జన్మించి వ్యాపార రీత్యా అచ్యుతాపురంలో స్థిరపడిన షేక్ అంజి ఆలయ అభివృద్ధికి తనవంతు సాయంగా రూ.10వేలను కమిటీ సభ్యులకు అందజేశారు.